క్లుప్తంగా

తప్పిపోయిన వృద్ధుడి అప్పగింత



వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సీఐ రవికుమార్, సిబ్బంది

మద్రిపాలెం: ఈ నెల 18న ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వృద్ధుడు అప్పారావు ఆచూకీని కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు తెలుసుకుని శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. దంట్ల అప్పారావు కుటుంబ సభ్యులతో కలిసి మురళీనగర్‌లో నివసిస్తున్నాడు. ఈ నెల 18న ఇంటి సమీపంలో ఓ బిల్డింగ్ పని జరుగుతుండగా అక్కడ ఉంటూ నిద్రపోయాడు. ఆ సమయంలో కుటుంబ సభ్యులు కాసేపయ్యాక ఇంట్లోకి పిలుద్దామనుకున్నారు. వృద్ధుడికి మతిమరపు ఉండటంతో అక్కడి నుంచి ఎక్కడికో వెళ్లిపోయాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు అంతటా వెతకినా ఆచూకీ దొరక్క పోవడంతో కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ సాధన సిబ్బందితో కలిసి గాలించగా ఎన్ఏడీ కొత్త రోడ్డు దగ్గర అప్పారావు ఉన్నట్టు తెలుసుకుని అతడిని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. పోలీస్ సిబ్బందిని సీఐ రవికుమార్ అభినందించారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిదిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామావృన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

ప్రమాదకరంగా గొయ్యి



శ్రీనివాసనగర్ గెడ్డ బ్రిడ్జి వద్ద రోడ్డు కుంగిపోయి ఏర్పడిన గొయ్యి

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లో గెడ్డపై నిర్మించిన బ్రిడ్జికి అప్రోచ్‌రోడ్ ఒక మూల కుంగిపోయి గొయ్యి ఏర్పడింది. గతంలో కూడా ఇదే విధంగా కుంగిపోయి గొయ్యి ఏర్పడగా.. ఇంజినీరింగ్ సిబ్బంది దానిని పూడ్చారు. కొద్ది నెలలకే అదే ప్రాంతంలో రహదారి కుంగి గొయ్యి ఏర్పడింది. శ్రీనివాసనగర్ గెడ్డపై బ్రిడ్జి నిర్మించిన రెండేళ్లలో రెండు సార్లు అప్రోచ్ రోడ్ కుంగిపోయిందని, అప్రోచ్ పనుల్లో నాణ్యత లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పునరావృతం కాకుండా పరిష్కరించాలని కోరుతున్నారు.

వీధి కుక్కలతో బెంబేలు



మధురానగర్‌లో వీధి కుక్కల సంచారం

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు మధురానగర్ హైస్కూల్ ప్రాంతంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా కుక్కలు గుంపులుగా వీధుల్లో తిరుగుతూ భయపెడుతున్నాయని, చిన్నపిల్లలు, మహిళలు, వాహనాల వెంట పడుతున్నాయని బెంబేలెత్తుతున్నారు. ఇళ్ల ముందు, పార్కింగ్ చేసిన కార్ల ముందు, పైన ఎక్కి పడుకుంటూ, దగ్గరకు వెళ్తే కరవడానికి మీద పడుతున్నాయని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కలను జనావాసాలకు దూరంగా తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి పెద్దపీట వేసి విద్యాలయాలను ఉన్నతంగా.. ఆదర్శంగా తీర్చిదిద్దారు. విద్యార్థుల బంగారు భవిత కోసం అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యార్థుల చదువులపై ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. పాఠశాలల స్థితిగతులను పట్టించుకోవడమూ లేదు. కూటమి ప్రభుత్వంలో విశాఖలోని పలు ప్రభుత్వ పాఠశాలల దుస్థితిని.. విద్యార్థుల అవస్థలను చూస్తే ఈ విషయం ఇట్టే అర్థమవుతుంది. అటు పాలకులు.. ఇటు అధికారుల నిర్లక్ష్యం.. విద్యార్థుల పాలిట శాపంగా మారింది.

- కంచరపాలెం

నేలబారు చదువులు



చాలీచాలని గదిలో 9వ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు



అరకొర విద్యుత్ వెలుగులో నేలపై కూర్చుని చదువుకుంటున్న 9వ తరగతి విద్యార్థులు

- కప్పరాడ జీవీఎంసీ హైస్కూల్‌లో చాలీచాలని తరగతి గదులు
- ఇరుకు గదుల్లో విద్యార్థుల అవస్థలు
- అసంపూర్తిగా నిలిపేసిన అదనపు అంతస్తు నిర్మాణం
- కన్నెత్తి చూడని పాలకులు, అధికారులు

54వ వార్డు ఐటీఐ కూడలి పరిధి కప్పరాడ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నేలబారు చదువులు సాగిస్తున్నారు. చాలీచాలని తరగతి గదుల్లో ఉపాధ్యాయుల విద్యా బోధన, పిల్లల విద్యాభ్యాసం జరుగుతున్నాయి. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు తరగతి గదులు లేకపోవడంతో ఇరుకు గదులు, వరండాలు, పాఠశాల స్టేజీలపై కూర్చుని చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అదనపు తరగతి గదుల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వినతులు సమర్పిస్తే.. జీవీఎంసీ నిధులు మంజూరు చేశారు. 2023లో అదనపు అంతస్తు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఆ సమయంలో సార్వత్రిక ఎన్నికల కోడ్ కూయడంతో.. పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. రెండేళ్లు గడిచినా.. కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు ఇటుగా కన్నెత్తి చూడటం లేదని తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు.

ఇరుకు గదుల్లో విద్యాభ్యాసం

కప్పరాడ హైస్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరంలో 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 695 మంది విద్యార్థులు చదువుతున్నారు. బోధన, బోధనేతర సిబ్బంది సుమారు 32 మంది విధులు నిర్వహిస్తున్నారు. సుమారు 10 తరగతి గదులు, 2 స్టాఫ్ రూమ్‌లు, ప్రధానోపాధ్యాయుడి గది, ఒక స్టోర్ రూమ్, ఒక లైబ్రెరీ–క్లర్క్ గది ఉన్నాయి. తరగతికి రెండు సెక్షన్ల చొప్పున ఏర్పాటు చేసినా గదులు సరిపోకపోవడంతో నేల మీద కూర్చునే విద్యార్థులు అవస్థలు పడుతూ చదువులు నెట్టుకొస్తున్నారు. అసంపూర్తిగా వదిలేసిన అదనపు ఫ్లోర్ నిర్మాణం చేపట్టాలని వినతులు అందించినా.. ప్రజాప్రతినిధులు, అధికారుల్లో ఎలాంటి చలనం కనిపించడం లేదు.

ప్రమాదకర స్థితిలో అదనపు అంతస్తు

ఈ పాఠశాలలో అదనపు ఫ్లోర్ నిర్మాణాన్ని అసం**పూర్తిగా వదిలేయడంతో** ఎండావానలకు గోడలు, పిల్లర్ ముక్కలు విరిగి గ్రౌండ్ ఫ్లోర్‌పై పడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారు. విద్యార్థులు ఆటలాడేటప్పుడు అటుగా వెళ్లనీయకుండా ఆయాలను కాపలా పెట్టే పరిస్థితి కనిపిస్తోంది. అసంపూర్తి నిర్మాణం వల్ల తమ పిల్లలు ప్రమాదం బారిన పడతారేమోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెగా పేరెంట్–మీట్ సంబరాలంటూ ప్రజాప్రతినిధులు, జోనల్ అధికారులు, కూటమి నాయకులు హడావుడి చేయడం తప్పా.. ఈ స్కూల్ వైపు కన్నెత్తి చూడటం లేదని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు, విద్యా శాఖాధికారులు స్పందించి అదనపు అంతస్తు నిర్మాణాన్ని పూర్తి చేసి తరగతి గదులను అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



ఇరుకు గదిలో ద్వారం వరకు నేలపై కూర్చున్న 7వ తరగతి విద్యార్థులు



కప్పరాడ జీవీఎంసీ ఉన్నత పాఠశాల



పాఠశాలలో అసంపూర్తిగా వదిలేసిన అదనపు అంతస్తు నిర్మాణం

ముందుగా గుర్తిస్తే క్యాన్సర్ నివారించవచ్చు



క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: నేషనల్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) కార్యక్రమంలో భాగంగా మహిళలందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల కోసం శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన మహిళల ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయడం ద్వారా ప్రారంభ దశలోనే క్యాన్సర్ కేసులను గుర్తించవచ్చన్నారు. ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ రాధాకుమారి, మెడికల్ ఆంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శిల్పా, నోడల్ పర్సన్ డాక్టర్ సాయిసుష్మ, డాక్టర్ కిరణ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హారిక తదితరులు పాల్గొన్నారు.

నిల్వ నీటితో ముప్పు



అక్కయ్యపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతంపేట: మంచి నీటిలో పెరిగే దోమలు కుట్టడం ద్వారా మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు వస్తాయని జీవీఎంసీ మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా 26వ వార్డు అక్కయ్యపాలెంలో సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. వారానికి ఒక రోజు డ్రైడే పాటించి నీరు నిల్వ చేసే గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకులను శుభ్రం చేసి నీటిని మళ్లీ పట్టుకోవాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఇంటికి వచ్చే జీవీఎంసీ సిబ్బందికి ప్రజలు సహకరించాలని, దోమ తెరలు వాడాలని సూచించారు. జ్వరం వస్తే సమీప ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కె.ఎస్.ఎస్.నారాయణ, ఏఎల్‌వో సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఐవీఎఫ్ సెంటర్ల తనిఖీ



తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: నగరంలోని పలు ఐవీఎఫ్ కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఇతర సరోగసీ బృందంతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. సంతానోత్పత్తి కేంద్రాల్లోని ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, స్కానింగ్ మిషన్లను పరిశీలించారు. నోవా ఐవీఎఫ్ కేంద్రం, ఐశ్వర్య ఫెర్టిలిటీ కేంద్రాలను సందర్శించి, అక్కడి పరిస్థితుల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో డీఎంహెచ్‌వో ఆ కేంద్రాలకు పలు సూచనలు చేశారు. ఆస్పత్రుల్లో ఏఆర్‌టీ కేంద్రాల నిర్వహణకు అనుమతులు ఉన్నాయా లేదా అని, వైద్యులు, ఇతర సిబ్బంది విద్యార్హతలను, ల్యాబ్ పరికరాలను పరిశీలించారు. ఈ తనిఖీ బృందంలో విక్టోరియా ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ గీతా వందన, కేజీహెచ్ రేడియాలజిస్ట్ డాక్టర్ రాధ, కేజీహెచ్ పాథాలజిస్ట్ డాక్టర్ టి. కిశోర్, కేజీహెచ్ సోషియాలజిస్ట్ డాక్టర్ శోభశ్రీ, సోషియాలజిస్ట్ ఎల్.వి. రమణి, ఎన్‌జీవో ప్రతినిధి కె. శివాజీ, మానిటరింగ్ కన్సల్టెంట్ డాక్టర్ బి. ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి (డీఎంఈవో) బి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కౌమార దశపై అవగాహన అవసరం



అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో కౌమార దశపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో నీలిమ

ఆరిలోవ: కౌమార దశపై కిశోర బాలికలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో నీలిమ అన్నారు. 12వ వార్డు ఆరిలోవ నెహ్రూనగర్‌లోని రాజేంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో శుక్రవారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ కిశోర బాలికలకు కౌమార దశ కీలకమైనదన్నారు. ఈ దశలో బాలికలు చదువులో రాణించేలా తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరమన్నారు. రక్తహీనతపై వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. 18 ఏళ్లు నిండిన బాలికలు శారీరక మానసిక స్థిరత్వం కలిగి ఉంటారని, యుక్త వయసు వచ్చేంత వరకు వివాహం చేసుకోకూడదని అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సెల్వియా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సెంటర్ కార్యకర్తలు అన్నపూర్ణ, కామేశ్వరి, స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, మహిళా పోలీస్, కిశోర బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్‌పై అవగాహన సదస్సు నేడు

సీతంపేట: సివిల్ సర్వీసెస్ పరీక్ష ప్రిపరేషన్‌పై ఈ నెల 23న శనివారం ఉదయం 10 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏకం ఐఏఎస్ అకాడమీ సంస్థ ప్రతినిధి శశి ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ సర్వీసెస్ వైపు అడుగులు వేస్తున్న విద్యార్థులకు మార్గదర్శకం చేయడానికి, సందేహాల నివృత్తికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రిటైర్డ్ మేజర్ ఎస్‌పీఎస్ ఒబెరాయ్ ముఖ్య అతిథిగా పాల్గొని సివిల్ సర్వీసెస్‌కు ఎలా ప్రిపేర్ అవ్వాలి, యూపీఎస్సీ పరీక్షా విధానం, టైం మేనేజ్‌మెంట్, రివిజన్ పద్ధతులు, ప్రస్తుత వ్యవహారాల ప్రాముఖ్యత, విజయానికి కావలసిన మైండ్ సెట్ తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు సదస్సుకు హాజరు కావచ్చని తెలిపారు.

నేడు జాబ్ మేళా

సీతంపేట: డాటాప్రో కంప్యూటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 23న జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు సంస్థ డైరెక్టర్ రంగినేని సాయిప్రసాద్ తెలిపారు. శంకరమఠం రోడ్డులోని సంస్థ కార్యాలయంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జాబ్ మేళా జరుగుతుందన్నారు. మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, బెలా మాంక్స్, ఆల్ హాండ్స్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్, కాన్‌సెంట్రిసిక్స్, టాటా ఎలక్ట్రానిక్స్, తాయో లాబ్స్, సుదర్శిని సొల్యూషన్స్ వంటి కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు, యువత, నిరుద్యోగులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని చెప్పారు.

మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు

మహారాణిపేట: ప్రభుత్వ, ప్రైవేటు ట్రైనింగ్ సెంటర్లలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (మహిళ) కోర్సులో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి, దరఖాస్తులు సమర్పించడానికి సెప్టెంబర్ 30 చివరి తేదీ అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. పూర్తి వివరాలకు https://cfw.ap.nic.in/ను సందర్శించాలని సూచించారు.

రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటుకు విజ్ఞప్తి

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో విద్యాసంస్థలు అధికంగా ఉన్నందున, విద్యార్థులు, అధ్యాపకులకు అనువుగా బస్టాప్ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడును జ్ఞానాపురానికి చెందిన 'సదా మీ సేవలో' ట్రస్ట్ వ్యవస్థాపకుడు వంకా సంజీవరావు కోరారు. శుక్రవారం ఆయనను కలిసి, ప్రజల సంతకాలతో కూడిన వినతిపత్రం అందించారు. జ్ఞానాపురంలో జూబ్లీ, సెయింట్ మేరీస్, సోఫియా జూనియర్ కళాశాల వంటి విద్యాసంస్థల విద్యార్థులు, అధ్యాపకులు, జేఎన్‌ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. ఇటు కంచరపాలెం నేతాజీ కూడలి, అటు జ్ఞానాపురం రైల్వేస్టేషన్, కాన్వెంటుకూడలి ప్రాంతాల్లో బస్టాప్‌లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇక్కడి విద్యార్థులు, ప్రజలు, ఉద్యోగులకు సరైన బస్టాప్ లేక కిలోమీటర్ దూరం నడుచుకు వెళ్లే పరిస్థితి ఉందన్నారు. అధికారులు స్పందించి రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు.

సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన

అల్లిపురం: సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. పెరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్, సీపీ బాగ్చి సంయుక్తంగా ఒక కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా నగర పోలీస్ కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక అక్షరాస్యత, కస్టమర్ల రక్షణ ప్రాముఖ్యత, మోసపూరిత లావాదేవీలు, 'గోల్డెన్ అవర్'పై ఇరు శాఖలు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు.

సమస్యలపై వినతి



జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులోని పలు సమస్యలపై వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందజేశారు. వార్డులో యూపీహెచ్‌సీ ఏర్పాటు, గాంధీనగర్ గెడ్డ పక్కనున్న ఓపెన్ స్థలానికి రిటైనింగ్ వాల్ కట్టడం, వార్డులో కార్యాలయం ఏర్పాటు చేయడం, కళింగనగర్‌లో నూతన అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు, అంబేడ్కర్ కాలనీలో టీడీఆర్‌లు అందజేయడం, అంబేడ్కర్ కాలనీలో గ్రీన్‌బెల్ట్ ఏరియాలో ఫెన్సింగ్ వేసి ఓపెన్ జిమ్ ఏర్పాటు, బీటీ రోడ్లు, డ్రెయిన్లు, మహత్ కాలనీ, భీంనగర్ కొండవాలు ప్రాంతంలో మెట్లు, అదే ప్రాంతంలో మిగిలి ఉన్న సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేయడం, గాంధీనగర్ కమ్యూనిటీ హాల్ రెనోవేషన్ వంటి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సత్వరమే వాటిని పరిష్కరించి ప్రజలకు మేలు చేయాలని కార్పొరేటర్ కోరారు.

'వైభవుడి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులుగా నియమించాలి'



వినతిపత్రం అందిస్తున్న ఎన్‌జీజీవోస్ కాలనీ సంక్షేమ సేవా సంఘం సభ్యులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులుగా తమనే నియమించాలని ఎన్‌జీజీవోస్ కాలనీ సంక్షేమ సేవా సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం వారు సీతమ్మధారలోని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు క్యాంప్ కార్యాలయంలో బీజేపీ నాయకురాలు శ్యామలదీపికను కలిసి వినతిపత్రం అందించారు. ఈ ఆలయం దేవదాయ శాఖ పరిధిలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా ట్రస్ట్ బోర్డు నియామకానికి చర్యలు తీసుకున్నారు. సభ్యుల నియామకం రెండు నెలల కిందటే పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ విధివిధానాలు ఖరారు కాకపోవడం వల్ల జాప్యం జరిగింది. ప్రస్తుతం ట్రస్ట్ బోర్డు సభ్యుల నియామకానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ బోర్డులో ఆలయానికి సంబంధం లేని, ఆలయ నిర్మాణానికి, అభివృద్ధికి కృషి చేయని ఇతర ప్రాంతాల వారిని సభ్యులుగా నియమిస్తున్నారనే ఊహాగానాల నేపథ్యంలో ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అసోసియేషన్ ఆధ్వర్యంలోనే వైభవుడి ఆలయ నిర్మాణం, అభివృద్ధి పనులు చేశారు. అతి తక్కువ కాలంలోనే నగరంలోనే ప్రముఖ ఆలయంగా గుర్తింపుతెచ్చారు. అప్పటి ప్రభుత్వంలో నిర్మాణ, అభివృద్ధి కమిటీల సభ్యులకు ప్రాధాన్యమిచ్చేలా చర్యలు తీసుకున్నారు. దేవదాయ శాఖలోకి తీసుకున్న తర్వాత గతంలో ఉన్న నిర్మాణ, మేనేజింగ్ కమిటీలు రద్దయ్యాయి. ఆలయం ఈ స్థాయికి కారణమైన పెద్దలను పట్టించుకునే వారే కరవయ్యారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘ ప్రతినిధులు పి.బలరామ్, సిహెచ్.రామచంద్రరాజు, ఇతర సభ్యులు ఉన్నారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

విశాఖ-లీగల్: వచ్చే నెల 13న జరగనున్న లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు సహకరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. కోర్టు ఆవరణలో శుక్రవారం బ్యాంకు ప్రతినిధులు, చిట్ ఫండ్ కంపెనీలు, ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో లోక్ అదాలత్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రాజీకి అవకాశమున్న కేసులను గుర్తించి, కక్షిదారులకు లోక్ అదాలత్ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని ఆయన కోరారు. బ్యాంకు అధికారులు, బీమా సంస్థల చిట్ ఫండ్ కంపెనీలు, ఫైనాన్స్ కంపెనీల అధికారులు, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.